స్కెచ్

# సీతంటే ఏమిటి?

కె. రామలక్ష్మి

ఈ ప్రపంచంలో ప్రతిక్షణం అన్నీ మారుతూనే ఉంటాయి. కాని, పుట్టాక మొదటిసారిగా సూర్యకాంతిచూసిన ఆచిన్నపల్లె మాత్రం మారదు. అక్కడే వుండిపోతే ప్రాణానికి విసుగ్గానే వుంటుందేమో-కాని, అలా జరగనే జరగదు. వయస్సుతోపాటు మారుతూ, ఆ పల్లెని విడిచి దూరంగా పోతాం. ఎప్పుడో జ్ఞాపకంవచ్చి మళ్ళీవస్తాం, ఆ రావడం- పోడానికే అని తెలుసు. అయినా,ఆ పల్లె చూసినకొద్దీ కొత్తగానేవుంటుంది. చూడని వింతలెన్నో వుంటాయి. ఎరగని కొత్త ముఖాలెన్నో వుంటాయి.

...దేశంలోవున్న కొన్నివందల పల్లెలలో తనదీ ఒకటి. అయినా తనకది ప్రత్యేకంగా కనిపిస్తుంది...అలా అంటే అంతా నవ్వుతారు. ప్రత్యేకించి మూర్తికి మరీ హేళనగా తోస్తుంది.

"నువ్వొక్కడివే పుట్టేవేవిటోయ్ పల్లెలో! అలాంటి పల్లెలెన్నో - వాటిలో ఎంతెంతమంది పుట్టలేదు? ఎందరెందరు ఆ పుట్టిన పల్లెల్లో పెరగలేదు?" అంటూ వేదాంతధోరణిలో చెప్పుకొంటూ పోతాడు. నాకు నవ్వొస్తుంది. అవును. పైవాళ్ళకి అలా కనిపిస్తుంది - కాని తనకో? కలలో కాకుండా, ఆ పల్లెలో ధీమాగా నడిచాడు. ఆ వింత ప్రశాంతత భరించలేక 'అవతలికే'నడిచాడు. కాని ఎక్కడికెడితే లేదు ఆ ప్రశాంతత?... ఆ తేడా కూడా తనకు తెలుసు-ఇక్కడిప్రశాంతతలా వేరెక్కడా వుండదు. అది వూహించుకొన్నదే కాని నిజంకాదంటాడు మూర్తి. అతనికేం తెలుసు-అసలు సంగతి? చెప్తే నవ్వుతాడు. "నాజీవితంలో అలాంటి 'సిల్లీ'incidents ఎన్నో!" అంటూ నవ్వుతాడు. 'సిల్లీ'ఎలా అవుతుంది? కలలో చూసినట్టు చూశాడు ఆ ప్రశాంత వదనాన్ని. అది తనను వెన్నంటి ఎప్పుడూవదలకుండా, తనుదాన్ని మరువకండా - వుంటాడని అనుకున్నాడా? ఆ ముఖంకోసం ఆ వ్యక్తి సాంగత్యాన్ని తాను సంపాదించ కోరలేదూ? మూర్తికేం తెలుసు?

...సీతా సీతా అంటూ ఎవరు పిలిచినా తిరిగి చూసేది. ఎవరో, ఎందుకు పిలిచారో అనే ప్రశ్నే లేకుండా, వింతగా మూతివంచి "ఎందుకూ?" అని అడిగేది. అది చూశాడు తను. తనూ అలా ఆపినప్పుడే తెలిసింది-కలగాంచిన కళ్ళు అవేనని.

"మీ యిల్లెక్కడ?"

"ఈ వూరికి కొత్తా?" కొంటెగా అడిగింది.

కొత్తా! కొత్తేమిటి?

"నే పుట్టి పెరిగింది యీవూరే."

"మరి నన్నెప్పుడూ ఇక్కడ చూడేలేదా?"

"లేదే...కాదుకాదు. చూశాను. నీకళ్ళు నాకు బాగా జ్ఞాపకం. ఏం అలా చూస్తావు!" అనకుండా వుండలేకపోయాడు తను.

"అయితే సరేలే, మాయిల్లు ఆ తోటలో పాకే." తిరిగేనా చూడకుండా వెళ్ళిపోయింది. అందరికీ తెలిసిన యీ సీత నాకెందుకు తెలియలేదు? కలలోనే ఎందుకు కనిపించింది తనకి? అది అంతుచిక్కని ప్రశ్న.

అప్పటినుండీ ప్రతిరోజూ, ఆ తోటలో ఆ పాకచుట్టూ సీతకోసంతిరిగాడు.సీత! ఎంతచక్కటి పేరు. సీత అంటే ఏమిటి?—విశాలమైన కళ్ళా?

సీతది వింత ప్రకృతి. అందరినీ ముగ్ధుల్ని చేస్తుంది. కాని ఎవరితోనూ స్నేహం చెయ్యదు. తనెంత ప్రాధేయపడ్డాడు-ఇద్దరం పెళ్ళిచేసుకొని హాయిగా వుందామని: ఎందుకూ? అంటుంది. ఎందుకూ ఏమిటి? పిచ్చిప్రశ్న. ఈ ప్రపంచంలో ఎందుకూకి సమాధానం ఎక్కడా దొరకదే! తనని పెళ్ళిచేసుకోడం—ఎందుకూ ఏమిటి? పాకవదిలి మండువాయింట్లో వుండడానికి. చిన్న రైతు యింట్లో చాకిరీ చేసుకుంటూవుండేకంటే, భూకామందు యింట్లో హాయిగా వుండడానికి. ఆ మాత్రం తెలియదూ ఈ పిచ్చి సీతకి? ఆ సీత అమాయకత్వానికి నవ్వొచ్చింది. కాని సీత నవ్విన

నవ్వూ చూసిన చూపూ చూస్తే ఆ అమాయకత్వారి తనదిలా తోచింది.

ఆ పాకకీ సీతకీ ఎలాంటి బాంధవ్యమో, తన సాంగత్యం ఆదరణా సీత ఎందుకు కాదందో ఇప్పటికీ అర్థం కాలేదు. అంతమాత్రంచేత తనా వ్యక్తిని మరిచిపోనూ లేదు.

ఎందుకు యీ పల్లెలో అనిపించింది. అందుకే దాన్ని వదిలి పట్నంచేరాడు. ఎన్నెన్నో వింతసంఘటనలకు గురి అయాడు. జీవితంలో, పట్నంలో, ధనం వుండీ హాయిగా బతకలేనివాడు తనెందుకవాలి?. అందుకే దర్జాగా జల్సాగా జీవితాన్ని గడిపాడు. కాని ఎంత సంతోషంగా కాలం గడిపినా, అంతర్యంలో తనలో ఎక్కడో సీత వుండిపోయింది. హృదయంలో మారుమూలలలో ఏకాంతత తప్ప తనకి ఇంకేంలేదు. ఒక్కొక్కప్పుడు యీ ఏకాంతాన్ని భరించలేక సౌఖ్యాన్వేషలో మునిగి తేలేవాడు...అంతే ఇక పల్లెకి తిరిగి రాకతప్పదు ఒక్కసారి సీతని చూడక తప్పదు. ప్రయాణం సంగతి మూర్తికిచెప్తే "మతి కానా పోయిందా! యీ పట్నాన్నే భరించలేని నువ్వు పల్లె నెలా భరిస్తావు?..."అంటాడు. అలా కాదు ఒక్కసారి పోయి రావలసిందే. మనిషికి నిద్దరా ఆకలిలాగే తనకీ యీకోరిక. ఏదైనాసరే, తింటేకాని ఆకలితీరదు. ఎక్కడేనాసరే, పడుకుంటేనేకాని నిద్దర అగదు. అలాగే తనకీ పల్లెటూళ్లో సీతని చూస్తేనేకాని, మళ్ళీ యీ వూళ్ళలో అందాన్నీ ఆనందాన్నీ ఆస్వాదించలేడు తను.

...ఆరోజు పల్లెలో అడుగిడితే... వింతగా కనిపించింది రాత్రిపూట వినీలాకాశం. దాన్ని యిదివరకెప్పుడూ తను చూళ్ళేదే!

...కొన్ని సంవత్సరాల క్రితం తను నడిచిన బాటలే తిరిగి యీ వాడు నడుస్తున్నాడు... ఏం మారలేదు...పాతయిళ్ళు కొన్ని డాబా యిళ్లుగా మారాయి. చిన్నచెట్లు కొన్ని బాగా మానుకట్టి ఎత్తయాయి.....అన్నీ తనకు తెలిసినవిలాగే వున్నాయి; తెలియనివిలాగే వున్నాయి!

...సీతకోసం భోగట్టాలు చేశాడు. సీత ఆ పల్లెలో లేదు. పెళ్ళిచేసుకొని పక్కవూరులో వుంది. పక్కవూరు వెడితే? వెడితే ఏమిటీ ప్రయోజనం? సీతనేమైనా అడిగే హక్కుకూడా తనకి లేదే; అడిగినా, ఎందుకూ? అంటుంది...తనెందుకు కాదంది సీత? అనేది సమాధానంలేని ప్రశ్న.

జీవితంలో శాంతిసౌఖ్యాలనిచ్చే సదవకాశాలు మన కళ్ళముందునించే త్వరితగతిని వెళ్ళిపోతూ వుంటాయి. వాటిని పోగొట్టుకొని జీవింప కలిగే ధైర్యం లేదని తెలుసు. కాని ఆ అవకాశాలని చేజిక్కించుకోడం తెలియదు. ఏం లాభం?

"ఒరే ప్రేమకథలు గాలికథలనేవాడివి-ఇప్పుడేమంటావురా?"అంటూ మూర్తిఅంటే,"అవును గాలి కథలు కాకమరేమిటి?" అంటాడు తను. ఆ భాష మూర్తికి అర్థం కాదు. ఎక్కువ ఎవరినైతే అభిమానిస్తావో, వాళ్ళే ని హృదయాన్ని గాయపరచి ఖేదపరుస్తారు - అంటే యిదివరకు నవ్వేవాను, ఇప్పుడు తెలుసుకొన్నాడు. అవును, తమని తిరిగి ఆదరించని వాళ్ళంటేనే అభిమానంఎక్కువ. వారికోసం సర్వాన్నీ-యీ జీవిత మనశ్శాంతిని కూడా త్యాగం చేస్తాం. ఏంచేసినా లాభం వుండదు. కాని మనస్సు చెప్పినమాట వినదు. "అందుకే అనుభవించు" అంటాడు మూర్తి. లేకుంటే చేసేదేముంది కనక!

రైలు కిటికీలోంచి పరుగెత్తే దృశ్యాలుచూస్తూ అనుకొన్నాడు, "గమ్యస్థానం అనేదే చేరుకోకుండా వెళ్ళిపోతున్నాను. కాని, కలకాంచిన ఆ కళ్ళు మటుకు, నన్ను వదలవు." వాటి సోయగం యీ వాస్తు ప్రపంచానికీ, అన్ని అవధులకీ, అన్ని అగాధపు లోతులకీ అతీతం... తను ప్రాణం పూర్తిగా వదిలిననాడే అవి తనని వెన్నంటడం మానేస్తాయి - తనకి నిద్ర అనేదే లేనప్పుడు అవి తనకి కలలో కనిపించవు. సీత! సీతంటే ఏమిటి? ప్రాణం స్పందించే మనిషా? శిల్పిచెక్కిన శిలా సౌందర్యరాశా?-కిటికీలోంచి ప్రకృతి పరుగెడుతూనే వుంటుంది. తన ఊహలు మటుకు సీతను దాటి వెళ్ళవు. పక్కనేవున్న మూర్తి నవ్వుతాడు "ఎక్కడో అపర దేవదాసులా వున్నావే!" అంటాడు. అయితే, సీతకి నామీద జాలేలా వుండదూ అనుకుంటాడు తను.

...ఆ పల్లె యికమారదు. దేశంలో కొన్ని వందల పల్లెల్లో తనదీ ఒకటి. అయినా, తనకది ప్రత్యేకత వహిస్తుంది మరి ... ఎవరు నవ్వినా, మూర్తి నవ్వినా దాన్ని తను కాదనలేదు. ★